# నిర్ణయం

— కె. మృణాళిని

మనిషి పొరబాటు చెయ్యడం సహజమంటారు. కావచ్చు. కానీ అన్ని సందర్భాల్లోనూ ఆ మాటను అనుకుని సరిపెట్టుకోవడం సాధ్యమా? నేను చేసిన పనిని కేవలం 'పొరబాటు' అనకూడదేమో. తన సంతోషాన్ని ఒక మార్గంలో వెతుక్కోవడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తికి ఇంకో బాట చాలా సాఫీగా సుగమంగా ఉందని చెప్పి, దారి మళ్ళించి, ముళ్ళ పొదల్లోకి తోసేసి 'అయాం సారీ పొరబాటైపోయింది' అని అనవచ్చని అంగీకరిస్తే, నేను చేసింది కూడా పొరబాటే.

నీలిమ, నేను ప్రాణస్నేహితులం. అలా అనడం కంటె నీలిమకు నేను ప్రాణస్నేహితురాలు అనడం సమంజసం. నాకు అందరూ స్నేహితులే గానీ, నీలిమ మాత్రం నన్నొక్కదాన్నే ఎక్కువగా అభిమానించేదీ, గౌరవించేదీ. చిన్నప్పట్నుంచి ఇంటా, బయటా కూడా నేను చాలా తెలివైన దాన్నని పేరు పొందడం వల్ల, నా తెలివితేటలు అసాధారణమైనవని, నా అభిప్రాయాలు విలువైనవని, నా నిర్ణయాలు తిరుగులేనివని నాలో ఓ విధమైన నమ్మకం ఏర్పడిపోయింది.

నీలిమ ప్రతి విషయానికీ నా మీద ఆధారపడడం ద్వారా నా ఆత్మవిశ్వాసాన్ని ఎక్కువ చేసేది. తను తీసుకోబోయే ప్రతి నిర్ణయానికీ ముందు నా సలహా అడిగేది. బహుశా నీలిమ అంతగా నా తెలివితేటలపై నమ్మకం ఉంచకపోతే, తన జీవితం ఇలా మారేది కాదేమో. కానీ ఆ మాట ఇప్పుడు అనుకుని లాభం లేదు.

ఇంటర్మీడియట్ కాగానే నీలిమ ఎం. బి. బి. యస్‌కు వెళ్తానంది. వాళ్ళింట్లో కాదనలేదు. కానీ నీలిమకు తల్లిదండ్రుల సమ్మతి చాలదు. వచ్చి నన్నడిగింది. 'ఎంట్రన్స్ రాయనా' అని. నేను ఖచ్చితంగా వద్దని చెప్పేశాను. తనలాంటి నాజూకు మనుషులకు డాక్టర్ చదువు పనికి రాదన్నాను. హాయిగా ఏ లిటరేచరో తీసుకుని చదువుకోమన్నాను. నీలిమ నా మాటలతో ఏకీభవించిందని వేరే చెప్పనవసరం లేదు. ఫలితంగా ఇద్దరం బి. ఏ. లో చేరాం. మిగిలిన విషయాల్లో నీలిమ అవగాహన, గ్రహింపుశక్తి తక్కువైనా, చదువులో మంచి శ్రద్ధ, కష్టపడి చదివే ఓపిక ఉండడం వల్ల తనెప్పుడూ చాలా మంచి మార్కులు తెచ్చుకునేది.

మేమిద్దరం కలిసి చదువుకున్నంత కాలం ప్రతి విషయానికీ తను నాతో సంప్రదింపులు జరిపేది. అసలు తను అడక్కపోయినా నేను ఉచిత సలహాలిచ్చేదాన్ని. నా మాట వినడం వల్ల ఎక్కువసార్లు తనకు మేలు జరగడంతో నీలిమ స్వయంగా ఏ పనీ తలపెట్టేది కాదు.

బి. ఏ. అయ్యాక ఇద్దరం ఇంగ్లీష్ లిటరేచర్‌లో ఎం. ఏ.లో చేరాం. ఫైనలియర్లో ఉండగా నీలిమకు వాళ్ళ నాన్న పనిచేసే బ్యాంకులో కొత్తగా క్లర్క్‌గా వచ్చిన సురేష్‌తో పరిచయమైంది. ఆ పరిచయం - ఇద్దరూ అప్పుడప్పుడు హోటళ్ళకెళ్ళడం, అతను వాళ్ళింటి కొచ్చి గంటలకొద్దీ కబుర్లు చెప్పడం వరకు వెళ్ళింది. వాళ్ళ స్నేహాన్ని నేను మొదట్నుంచి గమనిస్తూనే ఉన్నాను. అది స్నేహంగా మాత్రమే ఉన్నంతకాలం ఫరవాలేదనిపించింది. కానీ నేను అనుమానించినట్టుగానే అది అక్కడితో ఆగలేదు.

ఒక రోజు మధ్యాహ్నం క్లాసులైపోగానే నీలిమ లైబ్రరీ కెళ్దాం రమ్మంది.

"ఈ రోజు రెఫరెన్స్‌వర్క్ చేసే ఓపిక లేదు నీలూ" అన్నాను.

"దానికోసం కాదు. నీకో విషయం చెప్పాలి" నీలిమ అంది.

ఇద్దరం లైబ్రరీ కెళ్ళి, చుట్టుపక్కల ఎవ్వరూ లేని ప్రదేశంలో కూర్చున్నాం.

"ఊఁ ఏమిటి?" నీలిమ ఎంతసేపటికి మాట్లాడకపోయేసరికి నేనే అన్నాను.

"ఎలా చెప్పాలో తెలీడం లేదు....నీకు సురేష్ తెలుసు కదూ...." ఆగింది. నాకు అర్థమైంది. ఇలాటి సంభాషణలన్నీ ఇలాగే ప్రారంభమౌతాయి. వెంటనే అందుకుని అన్నాను.

"అతను, నువ్వు ప్రేమించుకుంటున్నారు. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారు. అవునా?"

తలెత్తి ఆశ్చర్యంగా చూసిన నీలిమ కళ్ళలో ప్రశంస కనిపించింది. చిన్నగా నవ్వి అంది—

"అసలు నీ కింతవరకు తెలీదనుకోవడం నా తెలివి తక్కువతనం" అని - అంతలో సీరియస్‌గా మారిపోయింది. "కానీ....అతను నన్ను ప్రేమిస్తున్న మాట నిజమే. నేను మాత్రం .... ఇప్పటి వరకు అతన్ని స్నేహితుడిగా మాత్రమే భావిస్తున్నాను. మొన్న అతను ప్రపోజ్ చేసినప్పుడు ఏమనాలో తెలీలేదు." ఒక్కక్షణం ఆగింది. నేను ఆత్రంగా, "ఒప్పేసుకున్నావా?" అని అడిగాను.

నీలిమ తల అడ్డంగా తిప్పింది.

"ఊహూఁ ఇంకా లేదు. కానీ ఒప్పుకుందామనే అనుకుంటున్నాను. ఆ పని చేసే ముందు నీకోసారి చెపుదామని...."

నేను తన చివరి మాటలతో తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాను. ఈ మాట కోసమే ఎదురు చూస్తున్నాను. తనిలా అంటుందని నాకు తెలుసు. తేలిగ్గా నవ్వేస్తూ అన్నాను.

"ఇంకా మాటివ్వలేదు కాబట్టి ఫర్వాలేదులే."

"అంటే" అయోమయంగా చూసింది.

"అంటే ఏముంది? నీ కిష్టం లేదని చెప్పెయ్"

ఇప్పుడు అనిపిస్తుంది— 'నీలిమ తన జీవితంలో అత్యంత ముఖ్యమైన సమస్య నెదుర్కొంటున్నప్పుడు నేనంత తేలిగ్గా ఎలా మాట్లాడగలిగానా' అని.

నీలిమ చివ్వున తలెత్తి చూసి, నెమ్మదిగా అంది. "కానీ....నా కిష్టంలేదని నేను అనలేదుగా!"

నేను ఒక్కక్షణం తన కేసి తీక్షణంగా చూశాను. తర్వాత ముందుకు వంగి, అడిగాను.

"నీలూ. నీకు చదువుమీద చాలా యిష్టం కదూ."

" అవును ". ' దానికీ దీనికీ సంబంధమేమి టన్న' భావం ధ్వనింపజేస్తూ అంది.

"ఎం. ఏ. తర్వాత ఏం చెయ్యదల్చుకున్నావు?"

"రీసెర్చ్" 'నీకు తెలీదా' అన్నట్టంది.

"అవునా? అయితే సురేష్‌నెలా చేసుకుంటావ్?"

నీలిమ నా కేసి వింతగా చూసింది.

"ఏమిటి నువ్వనేది ? ఎంతమంది రిసెర్చ్ పెళ్ళయ్యాక చెయ్యడం లేదు?"

నాకు కోపం, నవ్వూ రెండూ వచ్చాయి.

"అది కాదు, నీలూ. నేను చెప్పేది కొంచెం విను. సురేష్ ఏం చదివాడు? ఆఫ్టరాల్ బి. యస్. సి. నువ్వు పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తున్నావు. రిసెర్చ్ కూడా చెయ్యాలనుకుంటున్నావు." నా మాట పూర్తి కాకముందే నీలిమ ఎఱ్ఱబడ్డ ముఖంతో అంది.

"నాకు అలాంటి భావమే లేదు. నా కంటె తక్కువ చదివిన వ్యక్తిని చేసుకోవడం నాకేం చిన్నతనంగా అనిపించదు."

"నేను చెప్పేది పూర్తిగా విను నీలూ" ఓపిగ్గా అన్నాను. "ఇప్పుడు నీకు అభ్యంతరం ఉందని కాదు నేను చెప్పడం. సురేష్‌వైపు నుంచి కొంచెం ఆలోచించు. ఏ మగవాడికీ తన భార్య తనకంటె



# లోకజ్ఞానం

1. భూమి మీద నుంచి అంతరిక్షంలోకి మొట్టమొదటి కృత్రిమ ఉపగ్రహాన్ని ప్రవేశ పెట్టిన దేశం ఏది? ఏ సంవత్సరంలో?

2. ఇటీవల ఉత్తర భారతదేశాన్ని వరదలు, గాలివాన ముంచెత్తాయి. అలా ఏర్పడిన గాలి వాన తీవ్రత ఇంత అని కొలిచినట్లు చెబుతూ వుంటారు శాస్త్రజ్ఞులు. అయితే ఈ గాలివాన తీవ్రతను ఏవిధంగా కొలుస్తారో చెప్పగలరా? ఆ కొలమానం కనిపెట్టిన వ్యక్తి ఎవరు?

3. మనదేశంలో ఐదేళ్ళకొకసారి రాష్ట్రపతి ఎన్నికలు జరుగుతూ వుంటాయి. కాని యూరోప్‌లో ఒకదేశం తమ అధ్యక్షుని వరుస క్రమంలో సంవత్సరానికొకసారి ఎన్నుకుంటుంది. ఆ దేశం ఏది?

4. ప్రపంచంలోకల్లా ప్రప్రథమ 'న్యూక్లియర్ రియాక్టర్' ఎక్కడ, ఎప్పుడు నిర్మింపబడింది?

5. నవంబరు 11, 1918 ఉదయం పదకొండు గంటలకి ప్రపంచ ప్రజలందరూ స్వేచ్ఛగా వూపిరి పీల్చుకున్నారు. కారణం ఆ రోజు సరిగ్గా ఆ సమయానికి మొదటి ప్రపంచ యుద్ధం అంతమైంది. ఆరోజు ఏమని పిలువబడుతోంది?

6. మొదటి తెలుగు — ఇంగ్లీషు నిఘంటువు ఏ సంవత్సరంలో ప్రచురింపబడిందో చెప్పగలరా?

7. పాఠశాలలోనూ, కళాశాలల్లోనూ చదివిన విద్యార్థులు తాము చదివిన విద్యాలయాలను 'ఆల్మామాటర్' అని సంబోధిస్తూ వుంటారు. ఈ 'అల్మామాటర్' అంటే అర్థం ఏమిటి?

8. మన జాతీయ గీతం 'జన గణ మన....' అని అందరికీ తెలుసు. రవీంద్రనాథ ఠాగూర్ తను రాసిన ఈ జాతీయ గీతాన్నే ఆయన ఆంగ్లంలోకి అనువదించారు....దాని పేరేమిటి?

9. మైక్‌లలో మాట్లాడే మాటలను అతి స్పష్టంగా దూరంగా కూర్చున్న వారికి కూడా చేరవేస్తాయి లౌడ్ స్పీకర్లు. అయితే ఈ లౌడ్‌స్పీకర్‌ని కనిపెట్టిన వ్యక్తి ఎవరు? ఏ దేశస్థుడు?

10. ఉత్సవాలలోను, పెళ్ళిళ్ళలోనూ కూడా రికార్డు సంగీతం పెడుతూ వుంటారు. మరి ఈ గ్రామఫోను రికార్డును ఏ సంవత్సరంలో, ఎవరు కనుగొన్నారో చెప్పగలరా?

**[సమాధానాలు ఈ సంచికలోనే వున్నాయి. తెలియకపోతే, చూసి తెలుసుకోండి]**

అధికురాలు కావడం ఇష్టం వుండదు. అందులోనూ చదువు విషయంలో. తనతో సమానంగా చదివిన స్త్రీనే సహించలేని మగవాడు ఇక తనకంటె ఎక్కువ చదివిన అమ్మాయినెలా భరిస్తాడు?...."

"ఆ రోజులు పోయాయి మనూ. 'స్త్రీకి పురుషుడితో సమానమైన హక్కులు లేవ'ని ఇప్పటికీ చాలామంది అరుస్తున్నారు గానీ, నిజం చెప్పాలంటే చదువు విషయంలో ఆ భేదం పోయింది. పైగా, నేను తనకంటె ఎక్కువ చదువుకున్నానని సురేష్‌కు తెలీదేమిటి? అదేం కొత్త విషయం కాదుగా. నువ్వన్నట్లు ఈర్ష్యలాంటి భావాలు అతనికి వుంటే అసలెందుకు ప్రపోజ్ చేస్తాడు?"

"అక్కడే పొరబడుతున్నావు. పెళ్ళికి ముందు తెలిసినవే అయినా, పెళ్ళైన తర్వాత ఆ లోపాలు ద్విగుణీకృతమైనట్టు కనిపిస్తాయి. మనం రోజూ ఎన్ని సంఘటనలు చూడడం లేదు! మా పక్కింటాయన కోపం వచ్చినప్పుడల్లా భార్యను 'నా ఖర్మ కొద్దీ చింతమొద్దువి దొరికావ్' అంటూంటాడు. ఏం? ఆవిడ నల్లగా ఉన్నట్టు పెళ్ళి చూపుల్లో తెలీ లేదా? అప్పుడు ఊరుకున్న మనిషి ఇప్పుడెందుకు కేడవడం?"

ఒక్కక్షణం ఆగి, ఆ వేశాన్ని దిగ మింగుకుని మళ్ళీ అన్నాను. "ఒక విషయం చెప్పనా, నీలూ? పెళ్ళయ్యాక అందరూ మారి పోతారు. ముఖ్యంగా మగవాళ్ళు. లోకం తన గురించి, తన భార్య గురించి ఏమనుకుంటోందో అనే చింత ప్రతి మగవాడికీ ఉంటుంది. ఇప్పుడు నీ విషయమే తీసుకో. మీరిద్దరూ స్నేహితులుగా ఉన్నంతకాలం ఎవ్వరూ మీ డిగ్రీలను పట్టించుకోరు. అదే పెళ్ళయ్యాక చూడు. 'మీ ఆవిడ ఎం. ఏ. అటగా' అనో 'మీ కంటె ఓ డిగ్రీ ఎక్కువే చదివిందన్నమాట' అనో, 'ఎంతైనా ఈ కాలం ఆడవాళ్ళు చదువులో మనకంటె నయం' అనో—ఏదో అంటుంటారు. ఇంకొకటి కూడా ఆలోచించు. ఇంత చదివాక నీకు ఇంట్లో కూర్చో బుద్దేస్తుందా? ఎలానూ ఫస్ట్ క్లాసులో ప్యాసవుతావు కాబట్టి లెక్చరర్ ఉద్యోగం సులభంగానే వస్తుంది. బ్యాంక్ క్లర్క్ హోదా, లెక్చరర్ హోదా కంటె తక్కువని నేను నీకు చెప్పనక్కర లేదుగా?" నేను మాట్లాడుతున్నంతసేపూ నీలిమ ముఖంలోకి రెప్ప వాల్చకుండా చూస్తున్నాను. నేను వూహించినట్టుగానే తన మొహంలో అంత వరకు ఉన్న ధీమా తగ్గింది. నా మాటలు జాగ్రత్తగా వింటున్నట్టు కనిపించింది. తిరిగి అన్నాను. "ఇవన్నీ నువ్వు ఆలోచించలేదు కదూ. ఒక్క మాట నీలూ. స్నేహితుల మధ్యగానీ, భార్యాభర్తల మధ్యగానీ ఈర్ష్య అనే భావం ఒకటొస్తే ఇక ఆ బంధం నిలవదు." ఇలా మాట్లాడుతుంటే నీలిమ కంటె నేనేదో చాలా పెద్దదాన్నైపోయినట్టు అనిపించింది. అప్పటికీ నీలిమ ఏమీ మాట్లాడక పోయే సరికి మళ్ళీ అన్నాను. "నువ్వే ఆలోచించు, నీలూ. సురేష్‌కు నువ్వంటే అసూయ కలగడానికి అవకాశం ఉందంటావా లేదా! అతను స్వతహాగా అలా ఆలోచించకపోయినా స్నేహితులు అతన్ని బతకనివ్వరు. భార్యకంటె భర్త ఎందులో తక్కువైనా — ఒక అందంలో తప్ప, అనుకుంటూ — లోకానికి అది చాలా నీచంగానే అనిపిస్తుంది.... ఇక నీ రిసెర్చ్‌కి తిలోదకాలిచ్చుకోవాల్సిందే."

నీలిమ వంచిన తల ఎత్తలేదు. దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టుంది. కాస్సేపు ఇద్దరం నిశ్శబ్దంగా ఉండిపోయాం. తర్వాత తలెత్తి మెల్లిగా అంది.

"నువ్వు చెప్పింది సమంజసంగానే వుంది కానీ....సురేష్ అలాటివాడు కాదనిపిస్తుంది

మనూ. ప్రపంచంలో మగవాళ్ళందరూ ఒకేలా ఉంటారా ?''

నాకు చిరాకేసింది ఈ ప్రశ్నకు.

"బావుంది. సురేష్ అందరిలాంటి వాడేనా కాదా అని ఎక్స్‌పెరిమెంట్ చెయ్యడానికి అతన్ని పెళ్ళి చేసుకుంటావేమిటి ? అసలతను అలాటివాడు కాడని మాత్రం నీకేం నమ్మకం ? ఏదో నాలుగు కబుర్లు నవ్వుతూ చెప్పినంత మాత్రాన మనిషి స్వభావం తెలిసిపోదుగా ?'' అన్నాను. 'కొంత కాలంగా పరిచయమున్న సురేష్ స్వభావమే తెలీదంటే, ఎవడో ముక్కూ, మొహం తెలీనివ్యక్తి రేపొద్దున్న వచ్చి నన్ను ఉద్ధరిస్తాడని నాకేం నమ్మకం' అనిగానీ నీలిమ అప్పుడనివుంటే నేనేం జవాబివ్వలేకపోయేదాన్ని. కానీ తనలా అనలేదు. నేనేమన్నా వినడమేగానీ, తిరిగి మాట్లాడడం నీలిమకు చేతకాదు. అసలింతవరకు వాదించడమే గొప్ప. కాస్సేపు ఇద్దరం నిశ్శబ్దంగా ఉన్నాక, నేను మాటమార్చే ఉద్దేశంతో అడిగాను.

"అమధ్యెప్పుడో చెప్పావు ఒక ఐ. ఏ. ఎస్. ఆఫీసర్ గురించి. మీకు దూరం చుట్టం కూడా ననుకుంటా. మీ అమ్మావాళ్ళు ఆ సంబంధం చూస్తున్నారన్నావ్....''

నీలిమ మాట్లాడలేదు. తర్వాత తనన్న మాటలను బట్టి చూస్తే అంతకుముందు నేనడిగింది విన్నట్టులేదు.

"సురేష్ కెలా చెప్పను ?....మొన్న నేనేమీ చెప్పకపోయేసరికి, అదే అంగీకారంగా భావించాడేమో...అసలు నేనీ విషయం కొంచెం ఆలోచించుకోవాలి'' తనలో తను అనుకుంటున్నట్టుగా అంది. నేనిక సంభాషణ పొడిగించలేదు. అయినా, తను నా మాట వింటుందనే నమ్మకముంది.

*

రెండు రోజుల తర్వాత-ఆ రోజు సాయంత్రం నేను వరండాలో కూర్చుని ఏదో నవల చదువుతూం డగా నీలిమ మా యింటికొచ్చింది. కాస్సేపు అవీ, ఇవీ మాట్లాడుకున్నాం. మేం మాట్లాడుతున్న విషయాలపై మాకే ఆసక్తి లేదు. తనే చెపుతుందని నేనూ, నేనడుగుతానేమోననే ఉద్దేశంతో కాబోలు తనూ జాప్యం చేస్తున్నాం. కాస్సేపటికి తనే అంది.

"నేను సురేష్‌ను చేసుకోనని చెప్పేసాను''. నా గుండెల మీద నుంచి పెద్ద బరువు దించినట్టైంది. కానీ నీలిమ కొంచెం బాధపడుతున్నట్టు కనిపించడంతో, నేను మనసారా సంతోషించలేకపోయాను.



# వేదవతీ ప్రభాకర్

"సాధారణంగా ఒక పాట ప్రజలను ఆకర్షించిందీ అంటే అందుకు ముఖ్య కారణం – సంగీతం అని నా అభిప్రాయం. లయబద్ధమూ, రాగ యుక్తమూ అయిన సంగీతం పామరులను కూడా ఆకట్టుకుంటుంది. విన సొంపుగావుండి శ్రోతలను మైమరపింపజేస్తుంది. అలాగని సాహిత్యం పాటకి జీవం కాదు – అని నేను అనడం లేదు. కాని సాహిత్యం అర్థం కాని ఎన్నో పాటలు మనం విని ఆనందిస్తూనే వున్నాం కదా.'' అంటారు ప్రముఖ గాయకురాలు శ్రీమతి వేదవతీ ప్రభాకర్.

శ్రీమతి వేదవతి స్వస్థలం బెంగళూరు. ఆమె బి. ఏ. పట్టభద్రురాలు. బెంగళూరులో ఆమె ఐదేళ్ళపాటు శ్రీమతి జీ. చెల్లమ్మ వద్ద సంగీతం నేర్చుకున్నారు. శాస్త్రీయ సంగీతం అభ్యసించినా ఆమెకు లలిత సంగీతం మీద ఆసక్తి మెండు. అయితే 'శాస్త్రీయ సంగీతజ్ఞానం లేకపోతే స్వరాలు సరిగ్గా పలకవని, లలిత సంగీతానికి కూడా అది ఎంతో అవసరమని' అంటారు ఆమె.

శాస్త్రీయ సంగీతంలో ఆమె అభిమాన గాయకురాలు శ్రీమతి ఎమ్. ఎస్. సుబ్బులక్ష్మి.

హైద్రాబాదు ఆకాశవాణి కేంద్రంలో వేదవతి కంఠస్వరం తరచు వినిపిస్తూనే వుంటుంది. దూరదర్శిని కార్యక్రమాలలో కూడా ఆమె పాల్గొన్నారు. అంతేకాదు. ఆకాశవాణి ఏర్పాటు చేసే రంగస్థల కార్యక్రమాలలోనూ ఆమె తరచు పాల్గొంటూ వుంటారు.

"శాస్త్రీయ సంగీతం ప్రజలలో అంతగా ఆదరణ పొందకపోవడానికి కారణం ఏమిటి ?–అని ప్రశ్నిస్తే 'ఆదరణ ఎందుకులేదు? ఏ రకమైన సంగీతానికైనా దానికితగ్గ అభిరుచిగల శ్రోతలు ఎందరో వుంటూనే వుంటారు. ఎటొచ్చి సినిమా సంగీతమైతే తేలికగా పాడుకోవచ్చు. కాబట్టి అందరినోళ్ళలో నానుతూ వుంటుంది. అంతే,'' అన్నారు వేదవతి.

చక్కగా పాడిన ఏ పాట అయినా — తనకి యిష్టమని, జానపదాలు అయితే జీవితానికి దగ్గరగా వుంటాయని, దాని భావం నలుగురిని ఆకట్టుకునే విధంగా వుంటుందని–అందుకే ఆ పాటలంటే తనకి ప్రత్యేకించి యిష్టమని— చెప్పారు వేదవతి.

ఆమె భర్త శ్రీ ఆర్. ప్రభాకరరావు ప్రస్తుతం ఎ. పి. ఎస్. ఆర్. టి. సి. లో జనరల్ మేనేజర్‌గా వుంటున్నారు. వారికి ఒక కుమారుడు వెంకటేష్, కుమార్తె ప్రేమ. వెంకటేష్ సితార్ వాద్యం నేర్చుకుంటున్నాడు. ప్రేమ శాస్త్రీయ సంగీతం అభ్యసిస్తోంది. భర్త, స్నేహితులు యిస్తున్న ప్రోత్సాహం తనకి ఎంతో వుత్సాహాన్ని కలుగజేస్తోందంటారు వేదవతి.

శ్రీ సి. నారాయణరెడ్డి రాసిన 'మీరా భజన్' ఆమె గానం చేయగా ఇటీవల రికార్డు రూపంలో విడుదలయింది. అది విన్న కొందరు సంగీత దర్శకులు తమ చిత్రాలలో అవకాశం యివ్వడానికి ముందుకు వచ్చారు. చలన చిత్రాలలో పాడడం పట్ల తనకు వుత్సాహం వుంది కాని—అందుకోసం ప్రత్యేకించి ప్రయత్నమేదీ చెయ్యలేదు—అంటారు ఆమె.

భవిష్యత్ కార్యక్రమాల గురించి ప్రశ్నించగా– "ఈ రంగంలో కృషి చేసి పేరు తెచ్చుకోవాలని వుంది. కాని అవకాశాలు వచ్చినప్పుడే కదా ఆశయాలు ఫలిస్తాయి ప్రస్తుతానికి ఆకాశవాణి ద్వారా లభ్యమవుతున్న అవకాశాలు నాకు ఎంతో వుత్తేజాన్ని, వుత్సాహాన్ని యిస్తున్నాయి. నిజానికి నేను ఈనాడు ఒక స్థాయికి చేరుకోవడానికి కారణం ఆకాశవాణి అందించిన ప్రోత్సాహమే. అందుకు ఆకాశవాణికి నేను ఎంతో రుణపడి వున్నాను'' అంటారు శ్రీమతి వేదవతి ప్రభాకర్. —భార్గవి

క్రమంగా ఇద్దరం పరీక్షల గొడవలోపడ్డాం. నీలిమ సురేష్‌ను గురించి పెద్దగా ఆలోచించడం లేదని గ్రహించి, తేలిగ్గా ఫీలయ్యాను.

ఒక రోజు నీలిమ ఇంట్లో కూర్చుని చదువుకుంటూండగా, వాళ్ళమ్మ వచ్చి నీలిమకు పెళ్ళి నిశ్చయమైందని చెప్పారు. నాకు చాలా సంతోషం అనిపించింది.

"ఎవరండీ అతను?" కుతూహలంగా అడిగాను.

"ఒకసారి నీకు చెప్పాననుకుంటా........ మా చుట్టాలబ్బాయే. మొన్ననే ఐ. ఏ. ఎస్. పాసయ్యాడు....బాగా ఉన్నవాళ్ళు" ఆవిడ చెప్పుకుపోతోంది. నేను చప్పున నీలిమ కేసి చూసాను. తన మొహం ప్రసన్నంగా ఉంది. 'హమ్మయ్య' తృప్తిగా అనుకున్నాను. నేనేదో పెద్ద ఘనకార్యం చేసినట్టనిపించింది. 'సురేష్‌తో తన వివాహాన్ని ఆపేసి ఎంత మంచి పని చేసాను! ఇప్పుడు తన విద్యకు తగిన వరుడు దొరికాడు నీలిమకు. తను రిసెర్చ్ చెయ్యడానికి కూడా అవకాశం ఉంది. భార్యాభర్తల మధ్య 'ఇంటలెక్చువల్ ఈక్వాలిటీ' ఉండాలని నా గాఢవిశ్వాసం. భర్త ఐ. ఏ. ఎస్. ఆఫీసర్-భార్య ఎం. ఏ. పి. హెచ్. డి-ఆ జంట ఎంత ముచ్చటగా ఉంటుంది! అంత విద్యావంతుడైన వ్యక్తి నీలిమ ఆశయాలకు అడ్డురాడు.' నీలిమ కంటె ఎక్కువగా నేనే ఊహల్లో తేలిపోయాను.

తర్వాత నీలిమతో ఈ విషయం మాట్లాడినప్పుడు తను చాలా సంతోషంగా ఉన్నట్లనిపించింది. భవిష్యత్తులోకి ఆశతో, ఉత్సాహంతో ఎదురు చూడసాగింది.

పరీక్షలైన నెల రోజులకే నీలిమ పెళ్ళి అయిపోయింది. ఆ తర్వాత కొన్ని రోజులకే తను భర్తతో వైజాగ్ వెళ్ళిపోయింది.

నీలిమ పెళ్ళైన 6 నెల్ల తర్వాత—

ఆ రోజు నేను వాళ్ళమ్మగార్ని పలకరిద్దామని వెళ్ళాను. కొంతసేపు మామూలు కబుర్లు చెప్పుకున్నాక అడిగాను, "నీలిమ రిసెర్చికి అప్లై చెయ్యలేదేమండీ! టైం కూడా అయిపోనట్టుంది...."

ఆవిడ నా వేపొకసారి చూసి, "రిసెర్చ్ చెయ్యదటమ్మా. వాళ్ళాయనకి యిష్టం లేదట." అంది. నేను నిర్ఘాంతపోయాను. ఆవిడ దాన్నంత ముఖ్య విషయంగా భావించలేదు కాబోలు ఏవో వేరే విషయాలు చెపుతోంది. కొద్దిసేపు మర్యాద కోసం వుండి, తర్వాత పనుందని చెప్పి ఇంటికి వచ్చేసాను.

నీలూ రిసెర్చ్ చెయ్యదన్న వార్త నమ్మశక్యం కాకుండా వుంది. తను నా ప్రోద్బలం మీదే బి. ఏ. లో చేరినా, త్వరలోనే ఇంగ్లీష్ లిటరేచర్‌పై ఆసక్తి పెంచుకుంది. మేమిద్దరం ఎలాగైనా సరే ఎం. ఏ. చేసి రిసెర్చ్ చెయ్యాలని ఆ రోజుల్లోనే నిశ్చయించుకున్నాం. అసలు సురేష్‌ను తిరస్కరించడానికి కూడా ముఖ్య కారణం రిసెర్చ్‌కి తను అంగీకరించదేమో నన్న అనుమానం నీలిమకు కలగడమేనని నాకు తెలుసు. ఒక కవి రచనలు అంశంగా రిసెర్చ్ చెయ్యడం, ఒక మంచి లెక్చరర్‌గా పేరు తెచ్చుకోవడం నీలిమ ఆశయాలు. 'వాళ్ళాయనకి యిష్టం లేదట' నీలిమ వాళ్ళమ్మ మాటలు గుర్తొచ్చి, నా మనసంతా చికాకైపోయింది. పెళ్ళి ముందు నీలిమ తన ఆలోచన్ల గురించి, ఆశయాల గురించి చెప్పడానికి వీలు కా లేదా? ఏమో. పరీక్షల గొడవలో నేనప్పుడు పెద్దగా పట్టించుకోలేదు.

ఆ మరుసటి రోజా నాకు నీలిమ దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. ఆత్రంగా విప్పి చదివాను.

ప్రియమైన మనూ,

ఉపోద్ఘాతం లేకుండా నేను నీకు కొన్ని విషయాలు చెప్ప దలుచుకున్నాను.

మనూ, నాకీ మధ్య సురేష్ తరచు జ్ఞాపకం వస్తున్నాడు. అతనేవాడు 'పొయిట్రీలో రీసెర్చ్ చేస్తాననేదానివి, ఎక్కువ డిటెక్టివ్ నవలలు చదువుతావేం, నీలూ' అని. అతనలా మందలించినప్పుడు సీరియస్‌గా పొయిట్రి చదివేదాన్ని. ఇప్పుడా బెడదలేదు. నేను ఇష్టం వచ్చినట్లు నవలలు చదువుకోవచ్చు. నేనసలేమీ చదవకపోయినా ప్రశ్నించేవాళ్ళు లేరు. పైగా చదవకపోతే సంతోషిస్తారు కూడా. ఏమిటిలా తల తిక్కగా రాస్తున్నాననుకుంటున్నావా, మనూ? నీకు తెలుసు-నాకు లెటర్స్ రాయడం చాతకాదని.

లెక్చరర్‌గా వస్తే పాఠాలు చెప్పడం కోసమైనా రకరకాల పుస్తకాలు చదవాల్సి వుంటుంది. కానీ, నాకా బెడద కూడా లేదు. ఐ. ఏ. ఎస్. ఆఫీసర్ భార్యని. నాకేం ఖర్మ పాఠాలు చెప్పేందుకు?

అసలు ఇంకొకరికి పాఠాలు చెప్పే అర్హత నాకు లేదు, మనూ. నేనే ఇప్పుడిప్పుడు జీవితమంటే ఏమిటో నేర్చుకుంటున్నాను. పెళ్ళయ్యాక రెండు విషయాలు నేను ప్రధానంగా తెలుసుకున్నాను-ఉన్నత విద్య నేర్చినంత మాత్రాన మనిషికి సంస్కారం, విశాల దృక్పథం ఉండనవసరం లేదని; ఎవరి జీవితానికి సంబంధించిన నిర్ణయాలు వాళ్ళే తీసుకోవాలి గానీ ఇంకొకరి సలహాలను గ్రహించకూడదని. కానీ మనూ, నేను నిన్ను నిందించడం లేదు. నీ మీద నాకేం కోపం లేదు. ఇది స్వయంకృతాపరాధం.

ఇంకేం వ్రాయను? నువ్వు చాలా తెలివైనదానివి. నేను స్పష్టంగా చెప్పలేకపోయినా అంతా గ్రహించే సామర్థ్యం నీకుంది.

నేను హాయిగా ఉన్నానని అమ్మకు చెప్పు. వంటవాడు వండింది తినడం, పడుకోవడం, అప్పుడప్పుడు సినిమాల కెళ్ళడం, వాళ్ళతో, వీళ్ళతో బాతాఖానీ వెయ్యడం - ఇంతకంటె నాకేం కావాలి?

జీవితాన్ని ఇప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్నాన్నాను. దాన్ని భరించే శక్తిని నాకు దేవుడివ్వాలని ప్రార్థిస్తావా, మనూ?

—నీలిమ

నేను మెల్లిగా, జాగ్రత్తగా ఉత్తరాన్ని మడిచాను. నా కళ్ళ ముందు సురేష్ మెదిలాడు. ఒకప్పుడు చెక్కు చెదరని చిరునవ్వుతో, గలగలా మాట్లాడే సురేష్ - ఇప్పుడు నవ్వడమే మరిచిపోయినవాడిలా, ఏ సరదాలూ లేకుండా రోజుల్ని గడిపేస్తున్నాడు.

నేను నీలిమతో సురేష్ విషయం మాట్లాడినప్పుడు చెప్పినవన్నీ నేను త్రికరణశుద్ధిగా నమ్మినవే. అప్పుడు చాలా హేతుబద్ధంగా వాదించాను. నిజమే. కానీ, మానవ స్వభావానికి హేతువాదంతో సంబంధముందా? 'ఉన్నత విద్యనభ్యసించిన వ్యక్తి తన జీవిత సహచరిణిలో అదే కోరుకోవాలి. మగవాడు తనకంటె విద్యాధికురాలైన భార్యను ద్వేషిస్తాడు'—ఇది నేను ప్రమాణాలుగా పెట్టుకున్నవి. హేతువాదం ప్రకారం అదలా జరగాల్సిందే. కానీ జరగలేదేం?

నేను సిద్ధాంతాన్ని నమ్మడం పొరబాటు కావచ్చు, కాకపోవచ్చు. కానీ నా నమ్మకాన్ని నీలిమ నిర్ణయంతో ముడిపెట్టడం పొరబాటు మాత్రమేనని సరిపెట్టుకోగలనా?

నీలిమ ఉత్తరంలో 'నువ్వు చాలా తెలివైనదానివి' అంది. నాకు నవ్వొచ్చింది. 'జూలియస్ సీజర్'లో మార్క్ ఆంటోనీ అంటాడు-"బ్రూటస్ ఈజ్ ఎన్ ఆనరబుల్ మాన్" అని. అలా వుంది నీలిమ మాటల్లో భావం. □